
పర్యాటక రంగానికి పెద్దపీట

- డోన్ నియోజకవర్గానికి రూ.17.50 కోట్లు
- వెంకటాపురం, వెంగలాంపల్లె చెరువులు టూరిస్టు ప్రాంతాలుగా అభివృద్ధి
- నేడు టూరిస్టు, బోటింగ్ పనులకు భూమిపూజ చేయనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



వెంగలాంపల్లె చెరువు వద్ద ఏర్పాటు చేయనున్న రెస్టారెంట్ (నమూనా)



వెంగలాంపల్లె చెరువు ప్రస్తుత దృశ్యం

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం పర్యటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించింది. ప్రాచీన ఆలయాల పునరుద్ధీకరణ, పునర్నిర్మాణాలు, దేవాలయాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దుతానని ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతోంది. ఇందులో భాగంగా డోన్ నియోజకవర్గంలో పర్యాటక రంగం అభివృద్ధికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ఇప్పటికే రూ.17.50కోట్లను విడుదల చేసింది. దీంతో డోన్ నియోజకర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పర్యాటకాభివృద్ధికి నిధుల వరద

డోన్ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి చొరవతో డోన్ నియోజకవర్గానికి నిధులు విరివిగా మంజూరు చేస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. డోన్ మండలం వెంకటాపురం తుమ్మచెరువుతోపాటు ప్యాపిలి మండలం వెంగలాంపల్లె చెరువును టూరిస్టు కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ఒక్కోదానికి రూ. 3 కోట్లు చొప్పున మొత్తం రూ. 6 కోట్లు కేటాయించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. హంద్రీనీవా నీటితో నింపడంతోపాటు ఇక్కడ బోటు షికారు కేంద్రం ఏర్పాటు, రెస్టారెంట్ నిర్మాణానికి ప్రభుత్వం మరో రూ.6కోట్లను విడుదల చేసింది కూడా. అదేవిధంగా ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లె వాల్మీకి గుహల అభివృద్ధికి రూ.3కోట్లు, బేతంచెర్ల మండలం మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ నిర్మాణ పనులకు రూ.6కోట్లు, ఇదే మండలంలోని కేకే కొట్టాల సమీపంలో బిల్లల స్వర్గం అభివృద్ధికి రూ.2.50కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ప్యాపిలి మండలం, వెంగలాంపల్లె చెరువు వద్ద బుధవారం, డోన్ మండలం వెంకటాపురం చెరువు వద్ద గురువారం అభివృద్ధి పనులకు మంత్రి బుగ్గన భూమి పూజ చేయనున్నారు.

జిల్లాలోనే డోన్‌ను అగ్రస్థానంలో నిలిపే ప్రయత్నం

మంత్రి బుగ్గన సహకారంతో జిల్లాలోనే డోన్ నియోజకవర్గాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపే ప్రయత్నం చేస్తున్నాం. ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లె, బేతంచెర్ల మండలం బిల్లల స్వర్గం వద్ద గుహలు, వెంకటాపురం, వెంగలాంపల్లె చెరువులను టూరిస్టు ప్రాంతాలుగా మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 17.50 కోట్లు మంజూరు చేసింది. మద్దిలేటయ్య ఆలయంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– రాజేష్, అసిస్టెంట్ ఇంజినీర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కర్నూలు

మంత్రి బుగ్గన సాయం వెల కట్టలేనిది



ఏళ్లతరబడి పాలకుల నిర్లక్ష్యానికి గురైన మా గ్రామాల అభివృద్ధి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేస్తున్న కృషి వెల కట్టలేనిది. గ్రామాల్లో దాదాపు సమస్యలన్నీ తీరుతున్నాయి. మౌలిక వసతుల కల్పనతో పాటు వెంకటాపురం చెరువును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడం అనేది ఊహించని వరంగా మేం భావిస్తున్నాం.

– బోయ రాణి, సర్పంచ్, వెంకటాపురం

ప్రభుత్వ సాయం మరువం



జిల్లాలోనే అతిపెద్దదిగా పేరుగాంచిన వెంకటాపురం చెరువు సాగునీటి సామర్థ్యం పెంచడం రైతాంగం చేసుకున్న అదృష్టం. నియోజకవర్గంలో 10వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రభుత్వం లక్ష్యాన్ని అభినందించాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న పుణ్యం. ప్రభుత్వ సాయం మరువం.

– గట్టు మహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు, వెంకటాపురం

ఎంతో సంతోషంగా ఉంది



డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలానికి అనేక అభివృద్ధిపథకాలతో పాటు ఎన్‌హెచ్ 44 ప్రక్కన ఉన్న వెంగలాంపల్లె చెరువును పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతుండడం సంతోషకరం. బెలుం గుహలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్న వాల్మీకి గుహలను వెలికితీస్తుండటంతో ఈ ప్రాంతానికి పర్యాటకంగా మహర్దశ పట్టనుంది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– రంగస్వామి, సర్పంచ్, వెంగలాంపల్లె, ప్యాపిలి మండలం

నేటి నుంచి విస్తృతంగా పర్యటించనున్న మంత్రి బుగ్గన



డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గంలో మంగళవారం నుంచి వారం రోజులు విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం బేతంచెర్లలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్మించిన మహిళా మార్ట్‌ను ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి హాజరవుతారు. సాయంత్రం ప్యాపిలి మండలంలో వైఎస్ఆర్ ఆసరాలో పాల్గొన్న అనంతరం వెంగలాంపల్లె చెరువు వద్ద బోటింగ్, టూరిజం పనులకు భూమి పూజ చేస్తారు. రాత్రి డోన్‌లో బస చేసి 5వ తేదీ ఉదయం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారు. ఉదయం 10 గంటలకు డోన్ మండలం వెంకటాపురం చెరువు వద్ద బోటింగ్, టూరిజం పనులకు శంఖుస్థాపన చేస్తారు. అనంతరం పట్టణంలోని స్వగృహం ఎదుట పార్కును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి మంత్రి హాజరవుతారు. డోన్‌లో బసచేసి 6వ తేదీ మధ్యాహ్నం ప్యాపిలి మండలం ఎస్ రాచెర్ల గ్రామం నుంచి అవుకు మండలం కంబగిరి స్వామి దేవస్థానం వరకు వేసిన రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం దేవాలయ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు ప్యాపిలి మండలం హుసేనాపురం చేరుకొని వెటర్నటీ పాలిటెక్నిక్ కాలేజీతో పాటు గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రం పనులను పరిశీలిస్తారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 7వ తేదీన 10 గంటలకు డోన్ మండలం దేవరబండ నుండి మిద్దెపల్లె మీదుగా ఎద్దుపెంట వరకు వేసిన రహదారి పనులను ప్రారంభించి గుండాల చెన్నకేశవ స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులతో పాటు టీటీడీ కల్యాణ మండపం పనులను పరిశీలిస్తారు. అనంతరం డోన్‌కు చేరుకొని కార్యకర్తలతో సమావేశమవుతారు. 8వ తేదీ ఉదయం స్థానిక ప్రభుత్వ ఐటీఐ నందు ఏర్పాటు చేసిన కియా సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం డోన్ వెంకటనాయునిపల్లె రోడ్డును ప్రారంభిస్తారు. ఇదే రోజు రాత్రి బేతంచెర్లకు చేరుకుని 9వ తేదీ ఉదయం సీతారాంపురం రోడ్డును ప్రారంభించడంతో పాటు, బేతంచెర్లలో ఆటోనగర్ నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

క్లుప్తంగా

కనుల పండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సీతారాముల కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు నరేష్ శర్మ, పుల్లయ్య శర్మ, దివాకర్ శర్మ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన మహా మంగళహరతి నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు వరప్రసాద్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించగా 11.55 గంటలకు అభిజిత్ లఘ్నంలో ముత్యాల తలంబ్రాలు పోసి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద చేపట్టే రీ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం సర్వేయర్లు, వీఆర్వోలకు రీ సర్వేపై తహసీల్దార్ సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, మండల సర్వేయర్ జ్యోష్ణ, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, ఆర్ఐ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం రవికిశోర్

బనగానపల్లెరూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వనిత క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం డిపో మేనేజర్ రవికిశోర్ ప్రారంభించారు. ప్రయాణికులతో పాటు విద్యార్థులకు, ఆర్టీసీ సిబ్బందికి చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని డీఎం తెలిపారు. కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్ సంస్థల నిర్వాహకులు శ్రీరామవెంకట సుబ్రహ్మణ్యం, గుండా సుప్రజ, స్వర్ణలత, గుండా వసంత, గుండా శ్రీనివాసులు, చక్రపాణి, బచ్చురమేష్, టంగుటూరి శీనయ్య, రవికుమార్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరించిన శ్రీనివాసులుగౌడ్



శ్రీనివాసులుగౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

బనగానపల్లె: బనగానపల్లె తహసీల్దార్‌గా కె.శ్రీనివాసులుగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లడంతో అవుకు తహసీల్దార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. అనంతపురం జిల్లా కదిరి డివిజన్‌లో తలుపుల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసులుగౌడ్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయనకు ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్, వీఆర్ఓలు సురేష్‌రెడ్డి, గుడిసె గోపాల్, సురేంద్ర, ప్రసాద్ తదితరులు అభినదనలు తెలిపారు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్యాపిలి: స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తదితరులు సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, ఈఓ శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లె పట్టణంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 238 మంది విద్యార్థులకుగాను 14 మంది, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 164 మందికిగాను 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు శివప్రసాద్, నాగరాజు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగింది.

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 2వ సచివాలయంలో టౌన్ కన్వీనర్ అజాం బాషా ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ ధ్యేయంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని గ్రామ సచివాలయ, వలంటీర్లకు చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు, కన్వీనర్ కలామ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్

ప్యాపిలి: ఎంబీబీఎస్ చదువుతున్న పూర్వ విద్యార్థులు కుమార్ నాయక్, పద్మావతిని సోమవారం స్థానిక శివసాయి పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ఆ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో పేద ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సురేశ్, హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పద్మావతి, రాజు, పార్వతి, సంధ్యారాణి, కీర్తి, మహేశ్వరి, పుష్పవతి, అనిత, ప్రవళ్లిక, రాజేశ్‌బాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, పీఎంకేవీవై సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా వివిధ కోర్సుల్లో స్వల్ప కాల వ్యవధిలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా డోన్ న్యాక్ కేంద్రంలో ఏప్రిల్ 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్యాచ్‌లో పదవ తరగతి చదివి 18నుంచి 30 ఏళ్ల వారికి అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, సర్వేయర్‌తో పాటు అసిస్టెంట్ ప్లంబర్ వృత్తి రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పుల్లారెడ్డి సెల్ నంబరు 9573108032 సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బీఎస్సీ కంప్యూటర్స్ లేదా బీటెక్ చదివి 18 నుంచి 26 ఏళ్ల వారికి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విఘ్నేష్ 7981238237 నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: ప్రథమ చికిత్సలకే పరిమితం కాకుండా శస్త్ర చికిత్సలు, పట్టణంలో క్లీనిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఏఐవైఫ్ జిల్లా రణత్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రం నంద్యాలలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి కుమారికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏలాంటి అర్హత లేకున్నా వైద్య చికిత్సలు చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని రణత్ యాదవ్ జేసీ దృష్టికి తీసుకెళ్లారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి సోమవారం త్రయోదశి సందర్భంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు శాస్త్రోక్తంగా విశేషపూజలను నిర్వహించారు.ప్రదోషకాల సమయంలో నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను గావించారు. స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

పల్లకీలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు.

కన్వీనర్లు, గృహ సారథుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

కోవెలకుంట్ల: రాబోయే ఎన్నికల్లో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పాత్ర కీలకమని, ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, యువ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదు గ్రామ సచివాలయ పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో వలంటీర్‌కు అనుసంధానంగా ఇద్దరు గృహసారథులు, సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లను నియమించారన్నారు. పార్టీ కోసం అహర్నిషలు కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఆయా కుటుంబాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, చేకూరిన లబ్ధి జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్లు గడ్డం వరప్రసాద రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతలు తొలగించడమే లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్లు

డోన్ : ప్రజల మధ్య ధనిక, పేద అనే ఆర్థిక అసమానతలు తొలగించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఐదవ సచివాలయం పరిధిలోని 8వ వార్డులో కౌన్సిలర్ మౌలాబీ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలు వివరించారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి స్థలాలు, పక్కాగృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న చేయూత, చేదోడు, వైఎస్ఆర్ ఆసరా, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన తదితర పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, రైల్వే నాగేంద్ర, వెంకట్రాముడు, కోఆప్షన్ మెంబర్ పాతపేట రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, అశోక్, బుర్రు శ్రీధర్, డంకోష, భాస్కర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయా, స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రం నంద్యాలలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్ఓ పుల్లయ్యకు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్లుకు కూడా రూ. 21వేలు వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్ఓను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ కోరారు. తక్కువ జీతాలతో ఆయాలు, స్వీపర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్

డోన్ : డోన్ డివిజన్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నంద్యాల శాంతిరాం ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక షాధిఖానాలో నిర్వహించిన కంటివైద్య శిబిరంలో దృష్టిలోపం ఉన్న 40 మందిని గుర్తించారు. నంద్యాల ఆసుపత్రిలో కంటికి శస్త్ర చికిత్స అనంతరం సోమవారం రోగులకు మున్సిపల్ వైఎస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, హ్యూమన్ రైట్స్ కమిషన్ కౌన్సిలర్ జయకర్ చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు ఆదాం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జాన్సన్‌బాబు, కోశాధికారి ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద పరీక్షకు హాజరైన పదవ తరగతి విద్యార్థులు



డోన్ పరీక్ష గదిలో కూర్చున్న విద్యార్థులు



బనగానపల్లెలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



అవుకు పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

కోవెలకుంట్ల: పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 220 మందికి నలుగురు, బాలికోన్నత పాఠశాలలో 140 మందికి ఒకరు, సెయింట్ జోసెప్స్ పరీక్షా కేంద్రంలో 220 మందికి ఇద్దరు గైర్హాజర్ అయినట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపర్‌వైజర్లుగా రామకృష్ణ, అరుణకుమారి, లలిత శ్యామల, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా రాజ్యలక్ష్మి, కుమార్‌బాబు, యాంగటప్ప వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

ప్రశాంతగా పదవ తరగతి పరీక్షలు

డోన్ టౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. డోన్ పట్టణంలో 1730 మంది విద్యార్థులకు ఆరు స్కూలల్లో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 18మంది విద్యార్థులు గైరుహాజరుయ్యారని ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను పోలీసులు తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని బి కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మనోహర్ రెడ్డి తనిఖీ చేశారు.

కొలిమిగుండ్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. మండలంలో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాల నుంచి 670 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. అంకిరెడ్డిపల్లె సెంటర్‌లో గతేడాది జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ఏఎస్ఐ,ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు ముగ్గురు మహిళా పోలీసులను బందోబస్తు నియమించారు. పరీక్ష ప్రారంభం కంటే ముందుగానే విద్యార్థులను చెక్ చేసి అనుమతించారు. గొర్విమానుపల్లెకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు అంకిరెడ్డిపల్లెలో పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పులి ప్రకాష్‌రెడ్డి ఆటో ఏర్పాటు చేయించారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం పకడ్బందీగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మొదటి రోజు తెలుగు, ఉర్దూ పరీక్షకు ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1413 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 14 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లుగా నాగభూషణం, పద్మావతి, భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, వరప్రసాద్, సురేంద్రనాథ్, పుల్లయ్య ఆచారి వ్యవహరించారు.

అవుకు: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష పత్రాలను తీసుకువచ్చారు. అవుకు మండలంలో 507 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 14 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ శ్రీధర్ రావు తెలిపారు. మండల కేంద్రం అవుకులోని మూడు సెంటర్లను అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలితా కుమారి తనిఖీ చేశారు.

బేతంచెర్ల: మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 986 హాజరు కావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలతోపాటు సిమెంట్ నగర్, ఆర్ఎస్ రంగాపురంలో జరుగుతున్న పరీక్షలను ఎంఈఓ పరిశీలించారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ఉండగా 8: 30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రం చేరుకున్నారు.

ప్యాపిలి: మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 838 మంది విద్యార్థులకు గాను 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 223 మంది, బాలికల ఉన్నత పాఠశాల ఏ సెంటర్‌లో 159 మంది, బీ సెంటర్‌లో 110 మంది, జలదుర్గం ఉన్నత పాఠశాలలో 230 మంది, రాచర్ల ఉన్నత పాఠశాలలో 107 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈఓ తెలిపారు.